క్లుప్తంగా

బీసీ సంఘం జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలిగా దరియా



నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘ జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలిగా దాసరి దరియా నియమితులయ్యారు. విజయవాడలో శనివారం జరిగిన బీసీ సంఘాల ఆత్మీయ సమావేశంలో సంఘ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య నుంచి నియామక పత్రం అందుకున్నట్లు దరియా తెలియజేశారు. జిల్లాలో సంఘ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని చెప్పారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



పట్నంబజారు: మద్యానికి బానిసై ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసు స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓ షేక్ అన్వర్‌బాషా వివరాలు వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం వచ్చిన సమాచారం మేరకు గౌరీశంకర్ థియేటర్ వద్ద ద్విచక్ర వాహనంతో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. నిందితులను నగరంలోని లాలాపేటకు చెందిన షేక్ జానీబాషా, హైదరాబాద్‌లోని అశోక్‌నగర్, హనుమాన్ గుడి వద్ద నివాసం ఉండే మహంకాళి వెంకటేష్‌గా గుర్తించినట్లు తెలిపారు. నివాసాల ముందు పార్కింగ్ చేసి బైక్‌లను మారు తాళాలతో చోరీ పాల్పడుతున్నట్లు చెప్పారు. తెలిపారు. నిందితుల నుంచి రూ. 4 లక్షలు విలువ చేసే ఆరు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుల్ని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఏఎస్సై ఆంథోని, హెడ్‌కానిస్టేబుల్ నక్కా రవి, కానిస్టేబుల్ దేవ భిక్షం, షేక్ నజీర్‌ను అభినందించారు.

తాగునీరు కలుషితంపై అప్రమత్తత అవసరం



గుంటూరు ఎడ్యుకేషన్: కలుషితమైన నీటిని తాగడం వల్ల అనేక జబ్బుల బారిన పడే అవకాశాలున్నాయని, దీనిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గుంటూరు చలమయ్య-కర్నూలపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సంగడిగుంటలోని చలమయ్య కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగ ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులు స్థానికంగా ఇంటింటికీ వెళ్లి కాచి చల్లార్చిన నీటిని తాగాలని, కలుషితమైన ఆహారానికి దూరండా ఉండాలని అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ఏ. శ్రీధర్, ప్లేస్‌మెంట్ అధికారి చంద్రశేఖర్, కల్చరల్ కో-ఆర్డినేటర్ మధుసూదన్ పాల్గొన్నారు.

చదువు విలువ తెలుసుకోవాలి

విద్యార్థులంతా చదువు విలువ తెలుసుకోవాలని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్-4 విభాగ అధికారి డాక్టర్ కె.విజయ కుమారి సూచించారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన లాలుపురంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థినులు ప్రతి ఇంటికీ వెళ్లి చదువు ఆవశ్యకత వివరించారు. పాఠశాలకు వెళ్తూ మధ్యలో ఆగి పోయిన విద్యార్థుల్ని గుర్తించి, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు విద్య గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థుల్ని మరలా పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి ఎం.ఎస్. మీనాక్షి, కళాశాల అధ్యాపకులు ఎస్. విజయలక్ష్మి, ఎం. విజయలక్ష్మి పాల్గొన్నారు.

■ జేకేసీ కళాశాల ఆధ్వర్యంలో అడవితక్కెళ్లపాడులోని నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి, తడిచెత్త, పొడిచెత్త గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారి డి. రాహుల్ పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని



మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని, వేదికపై మనోహర్ నాయుడు, అప్పిరెడ్డి, యేసురత్నం, కరుణకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: మహనేత వైఎస్సార్ పరిపాలన తరువాత రాష్ట్ర ప్రజలు కనీవినీ ఎరుగని రీతిలో ప్రజా సంక్షేమాన్ని జగనన్న ప్రభుత్వంలోనే చూస్తున్నారని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 25వ డివిజన్ పరిధిలో ఆదర్శనగర్‌లో శనివారం మనతో మన రజినమ్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలోనే ఏ ఒక్క రాష్ట్రంలోనూ లేవని చెప్పారు. మీ ఇంటి ఆడపడుచుగా పశ్చిమ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా అంతిమ విజయం వైఎస్సార్ సీపీదేనని ధీమా వ్యక్తం చేశారు. పొన్నూరు ఎమ్మెల్యే, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్ పరిపాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ఆయన పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ పేదలకు ఎటువంటి కష్టం వచ్చినా చెప్పుకుని, బాధలు తీర్చేందుకు జగనన్న ప్రభుత్వం కొండంత అండగా ఉందని తెలిపారు. ఎమ్మెల్సీ చంద్రగిరి యేసురత్నం మాట్లాడుతూ సంక్షేమ పాలన కొనసాగేందుకు వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్. జగన్‌కు అఖండ విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ అధికారం ఒక్కటే లక్ష్యమనే విధంగా ప్రతిపక్షాలన్నీ ఒక్కటై దుర్మార్గపు పొత్తులతో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు ఏకమవుతున్నాయని తెలిపారు. ప్రజలు మెచ్చిన, వారి బాగోగులను చూస్తున్న నాయకుడైన ఆయన్ను

ఎదుర్కోవడం అంటే కొండను ఢీకొట్టాలని చూడటమే అని, ఇది సాధ్యమయ్యే విషయం కాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విడదల రజిని, కిలారి రోశయ్య ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి, నాయకులు నూనె ఉమామహేశ్వరరెడ్డి, గనిక ఝాన్సీ, అనుబంధ విభాగాల నాయకులు, కన్వీనర్లు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

సమరానికి 'సిద్ధం' కావాలి

పట్నంబజారు: ఎన్నికల పోరాటంలో పేదల పక్షాన రాజీలేని పోరుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పిలుపునిచ్చారు. గుంటూరు చంద్రమౌళీనగర్ ప్రధాన రహదారిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం కార్పొరేటర్లు, క్లస్టర్, మండల ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. మంత్రి రజిని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడుతో కలిసి పార్టీ నేతలతో సమీక్షించారు. మంత్రి రజిని మాట్లాడుతూ కుట్రలు, కుతంత్రాలతో పేదలకు జరుగుతున్న మంచిని సర్వనాశనం చేసేందుకు పెత్తందారులంతా ఒక్కటై ఎన్నికలకు సిద్ధమైనట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, పేదలకు మేలు జరగాలంటే జగనన్నే సీఎం కావాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. అద్దంకిలో ఈ నెల పదో తేదీన జరగనున్న సిద్ధం సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. పశ్చిమలో ఈసారి వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ చెప్పారు. నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు మాట్లాడుతూ గుంటూరు నగరంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని, రోడ్లు, డ్రెయిన్లు, మౌలిక సదుపాయాల కల్పనలో ఎక్కడా రాజీ లేకుండా పనిచేశామని తెలిపారు. నగరంలో జరిగిన అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, క్లస్టర్, మండల ఇన్‌చార్జిలు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరానికి కొత్త రూపు తీసుకురావడమే ధ్యేయం

గుంటూరు నగరానికి కొత్త రూపు తీసుకురావడమే తమ ధ్యేయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు నగరంలోని నల్లచెరువు వాకింగ్ ట్రాక్‌ను శనివారం ఆమె సందర్శించారు. కొద్దిసేపు స్థానికులతో కలిసి ట్రాక్‌లో నడుస్తూ.. వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరగా తప్పక చేయిస్తానని హామీ ఇచ్చారు. మరి కొందరు స్థానికంగా ఉన్న సమస్యలను ప్రస్తావించారు. వాటన్నింటినీ సావధానంగా విన్న మంత్రి రజిని తనతో పాటు ఉన్న మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడుతో చర్చించారు. నల్ల చెరువు ప్రాంతంలో సమస్యలన్నింటిని తప్పక పరిష్కరిస్తామని మంత్రి, మేయర్ స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఓ షాపు వద్ద ఆగి మంత్రి స్థానికులతో కలిసి టీ తాగారు. నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో మంత్రి రజినీకి పూర్తిస్థాయిలో అంతా మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. సంక్షేమాన్ని ప్రతి ఇంటికి చేర్చి, నగరమంతా అభివృద్ధి పథంలో ముందుకు దూసుకువెళ్లేలా పాటుపడిన సీఎం వైఎస్. జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యోగేశ్వర రావు, ఇన్‌చార్జి టెంట్ హౌస్ బాబు, నాయకులు పల్లపు మహేష్, గేదెల రమేష్, ఖాజా పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజిని

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. స్తంభాలగరువులోని ఉడుముల సాంబిరెడ్డి-కోటి రత్నం రెడ్డి బాలికల వసతి గృహంలో శుక్రవారం విద్యార్థినులు, మహిళలతో ఆత్మీయ సాధికార సమావేశాన్ని నిర్వహించారు. వసతి గృహ అధ్యక్షుడు ఉడుముల శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి రజిని మాట్లాడారు. దేశ, రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న మహిళలు విద్యావంతులు కావడంతో పాటు ఉన్నత ఉద్యోగులుగా, పారిశ్రామికవేత్తలుగా, రాజకీయ నాయకులుగా మారినప్పుడే రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంలోనూ మహిళలకే ప్రాధాన్యమివ్వడంతో పాటు 32 లక్షల ఇళ్ల పట్టాలకు వారినే హక్కుదారులుగా చేశారని చెప్పారు. 30 లక్షల గృహ నిర్మాణాలు మహిళల పేరుపైనే జరుగుతున్నాయని వివరించారు. దిశ చట్టం అమలుతో పాటు స్త్రీలు ఆత్మగౌరవం, స్వావలంబనతో సాధికారిత సాధించాలని పట్టుదలతో ప్రతి పథకంలో మొదటి ప్రాధాన్యత వారికే ఇస్తూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వివరించారు. వసతి గృహ కార్యదర్శి వణుకూరి సూరారెడ్డి మాట్లాడుతూ రెండు దశాబ్దాలకు పైగా పేద, మధ్యతరగతి బాలికలకు వసతి, భోజన సదుపాయాలతో పాటు దాతల సహకారంతో లక్షలాది రూపాయలు ఉపకార వేతనాలు అందిస్తూ మహిళల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చల్లా రాజ్యలక్ష్మి, ఉడుముల శ్రీనివాస రెడ్డి, బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బండి అశోక్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఉడుముల అప్పిరెడ్డి, నాయకులు భూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, దుగ్గింపూడి వెంకటరామిరెడ్డి, గణిక ఝాన్సీరాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు మహోత్సవాలు



లక్ష్మీపురం: హుజూర్ గౌసే ఆజం దస్తగిర్ (హజ్రత్ మహబూబ్ సుభాని) వారి 17వ మనుమలు గుంటూరు నగరంలో వేంచేసి ఉన్న హజ్రత్ మొహియుద్దీన్ బాద్‌షా అవులియా బాబా 314వ ఉరుసు, హజ్రత్ సయ్యద్ షా అసదుల్లా ఖాదిరి బాబా వారి 90వ ఉరుసు మహోత్సవాలు పండుగ వాతావరణంలో అత్యంత వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని దర్గా పీఠాధిపతులు మహబూబ్ సుభాని వారి 23వ మనుమలు సయ్యద్ షా సులేమాన్ ఖాదిరి అల్ జిలానీ సాహెబ్ అన్నారు. స్థానిక నల్లచెరువు ఎత్తురోడ్డు సెంటర్‌లోని హజ్రత్ మొహియుద్దీన్ పాలెంలోని దర్గా ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా పవిత్ర రంజాన్ మాసానికి ముందు వచ్చే షాబాన్ మాసం చంద్రమాన 21వ రోజు తమ తండ్రి గురువులైన సయ్యద్ షా నూరుల్ ముస్తఫా ఖాదిరి ఆశీస్సులతో బాబా ఉరుసు మహోత్సవాలు నాలుగు రోజుల పాటు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ మహోత్సవాలు ఈనెల 3వ తేదిన ఆదివారం రాత్రి 9 గంటలకు సందల్ షరీఫ్(గంధోత్సవం)తో ప్రారంభమవుతాయన్నారు. 4వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం, రాత్రి 9 గంటలకు హైదరాబాద్ వారి బృందంతో గొప్ప ఖవ్వాలి, 5వ తేదీ సాయంత్రం ఖతమ్ షరీఫ్ సందర్భంగా గొప్ప అన్నదానం, రాత్రి 10 గంటలకు నాత్ ఎ షరీఫ్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మొహియుద్దీన్ పాలెం వాసులు, నగర ప్రముఖులు, పీర్ మురీదులు పాల్గొన్నారు.

బైక్ దహనం

గుంటూరు ఈస్ట్: గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని తగులబెట్టిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణబాబు కాలనీలో నివసించే డి.శ్రీనివాస్ మిర్చి యార్డులో కూలిగా పనిచేస్తుంటాడు. శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు నిలిపి లోపలకు వెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని తగులబెట్టారు. ఈ మేరకు శ్రీనివాస్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

ఎన్నికల నిర్వహణపై సమావేశంలో కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులదే కీలక పాత్ర అని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సజావుగా జరగడానికి బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి తెలిపారు. ఎన్నికల విధులపై సెక్టోరల్, రూట్ అధికారులకు అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ కె.రాజ్యలక్ష్మితో కలిసి శనివారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా గుంటూరు తూర్పు, పశ్చిమలో ఒక్కో నియోజకవర్గానికి 22 మంది సెక్టోరల్, 22 మంది రూట్ అధికారులకు విధులు కేటాయించామని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన నాటి నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వస్తుందని, సెక్టోరల్ అధికారులు ముందుగా తమకు కేటాయించిన ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని ఆమె ఆదేశించారు. ముందుగా ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాలతో కూడిన హ్యాండ్ బుక్‌ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ వచ్చిన అనంతరం నగర పాలక సంస్థలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులకు, వికలాంగులకు వీలుగా ర్యాంపులు, విద్యుత్, తాగునీటి సరఫరా, మరుగు దొడ్లు వంటి కనీస వసతులపై రిపోర్ట్ ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్‌ఓ నిరంజన్, ఏఈఆర్‌ఓ ప్రదీప్ కుమార్, మేనేజర్ శివన్నారాయణ, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్లు సాంబశివ రావు, ప్రసాద్, పద్మ పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలి

నగరంలో మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) సర్వేకు సహకరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. శనివారం జిల్లా పరిశ్రమల శాఖ అధికారులతో కలిసి సర్వే పోస్టర్‌ని నగరపాలక సంస్థలోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ స్కీం ద్వారా ఎంఎస్ఎంఈ ఏకీకృత పోర్టల్ ప్రారంభించిందన్నారు. ఇందులో ఒక అంశమైన ఎంఎస్ఎంఈ ఫార్మలైజేషన్‌లో భాగంగా పరిశ్రమల శాఖ ఈ నెల 1 నుంచి 20 వరకు సర్వే నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లాలోని పరిశ్రమలకు ఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌ని అనుసంధానం చేయడం కోసం జరిగే సర్వేలో నగరంలోని అన్ని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మదన్ మోహనశెట్టి, డీడీ ఎం.సుధాకర్, జోనల్ మేనేజర్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

రూ.1497.14కోట్లతో వార్షిక బడ్జెట్



నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి బడ్జెట్‌పై అధికారులతో సమావేశమైన మేయర్ కావటి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ 2024-25 సంవత్సరానికి రూ.1497.14 కోట్ల అంచనాలతో శనివారం నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సభ్యులు వార్షిక బడ్జెట్‌ను ఆమోదించారు. నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి నగరపాలక సంస్థ విభాగాధిపతులతో, ఆడిట్ అధికారులతో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రివైజ్డ్ బడ్జెట్, 2024-25కు సంబంధించిన అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌పై మేయర్ చాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరం రూ.634.56 కోట్ల ప్రారంభ నిల్వతో పాటు వార్షిక ఆదాయం రూ.612.62 కోట్లతో కలిసి రూ.1247.19 కోట్లతో కౌన్సిల్ ఆమోదం చేసి ఉందన్నారు. అందులో రూ.578.62 కోట్లు ఖర్చులు పోగా, అంత్య నిల్వ రూ.669.56 కోట్లుగా ఉందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రారంభ నిల్వ రూ.669.56కోట్లు ఉండగా, నగరపాలక సంస్థ సంవత్సరానికి సంబంధించిన ఆదాయం రూ.828.57 కోట్లు అంచనాతో రూ.1497.14 కోట్లతో వార్షిక బడ్జెట్‌ని స్టాండింగ్ కమిటీ ఆమోదించిందని పేర్కొన్నారు. రూ.923.47 కోట్లు ఖర్చులు పోగా అంత్య నిల్వ 573.66 కోట్లు ఉంటుందని తెలిపారు. త్వరలో జరిగే కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదం కోసం ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, వెంకట లక్ష్మి, విభాగాధిపతులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు షేక్ మహమూద్, సంకూరి శ్రీనివాస రావు, కంద్రగుంట గురవయ్య, శ్యామల వెంకట రమణాదేవి, మల్లిబోయిన శ్రీవల్లి, పాపతోటి అంబేడ్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ప్రాజెక్టులను తిలకిస్తున్న కేవీ సెబాస్టియన్, మంజు



ప్రాజెక్టులను తిలకిస్తున్న చిన్నపరెడ్డి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని మాంటిస్సోరి ఇంగ్లిషు మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ కేవీ సెబాస్టియన్ పేర్కొన్నారు. నగరంపాలెంలోని పాఠశాలలో శనివారం నర్సరీ నుంచి 9వ తరగతి విద్యార్థులతో ఏర్పాటు చేసిన క్రియేటివ్ ఎక్స్‌పో ఆకట్టుకుంది. 500కు పైగా నమూనా ప్రాజెక్టులను ప్రదర్శించారు. రోబోటిక్, చంద్రయాన్, జంతు అవయవాల ప్రదర్శన, గణిత నమూనాలతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాల సమాహారంగా అద్భుతమైన ప్రాజెక్టులతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

■ 21వ శతాబ్దంలో ప్రపంచంలోని అగ్రదేశాల్లో ఒకటిగా మారబోతున్న భారతదేశాన్ని వైజ్ఞానిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అగ్రగామిగా నిలిపే బాధ్యత రేపటి పౌరులైన విద్యార్థులపైనే ఉందని నవీన విద్యాసంస్థల చైర్మన్ ఏరువ చిన్నపరెడ్డి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హైస్కూల్లో శనివారం విద్యార్థులు 100కు పైగా ప్రదర్శనలతో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపరెడ్డి మాట్లాడుతూ గత 44 ఏళ్లుగా పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్ కలలను విద్య ద్వారా సాకారం చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రదర్శనలోని రాకెట్స్, లాంచింగ్ స్టేషన్స్, ఉపగ్రహాలు, రోబోటిక్స్, డ్రోన్స్, సోలార్, ఏకో ఫ్రెండ్లీ హౌసెస్ విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఏరువ చిన్నమ్మ, డైరెక్టర్లు నవీన్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, మాధవి, సునీత, ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి పాల్గొన్నారు.